క్లుప్తంగా

వర్షాలతో రైతుల హర్షం

పామర్రు: గత వారం రోజులుగా వర్షాలు లేక ఎండ వేడిమి వలన వరి పంటతో ఇబ్బందులు పడుతున్న రైతులు బుధవారం కురిసిన వర్షంతో కొంత ఊరటనిచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల వలన వరి పంటకు ఊతం లభించిందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం వరి పంట కుదురులు చేసే దశలో ఉన్నదని, ఈ దశలో వర్షాలు కురవడం వలన వరి పంటకు మేలు జరుగుతుందని అంటున్నారు. పామర్రు మండల పరిధిలోని పలు పల్లపు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. స్థానిక గఫార్ సెంటర్, అరండల్‌పేట, బాపూజీ పేట తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపైనే నిలవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మండవల్లిలో వర్షం

మండవల్లి: మండలంలో బుధవారం ఉదయం నుంచి వర్షం కురిసింది. వరిపైరుకు ఈ వర్షం ఉపయోగం అని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు ప్రదేశాలలో వర్షం నీరు నిలిచి పలు గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



పామర్రు: మండల పరిధిలో పెన్షన్ పంపిణీ చురుగ్గా జరుగుతోంది. అర్హులైన లబ్ధిదారులకు సామాజిక పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 10వ తేదీ వరకు పొడిగించడంతో లబ్ధిదారులు అందరికీ పెన్షన్‌లు అందిస్తున్నారు. పామర్రు పంచాయతీలోని 20వ వార్డులో వీరంకి విజయలక్ష్మికి కొత్తగా మంజూరైన వితంతు పెన్షన్‌ను బుధవారం ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పామర్రు మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, వార్డు మెంబరు కుతాడి శిరేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల పరిధిలో మొత్తం 7,600 వరకు పలు రకాల పెన్షన్‌లు ఉన్నాయని, వీటికి అదనంగా ఈనెల నుంచి ప్రభుత్వం సుమారు 425 వరకు కొత్త పెన్షన్‌లను మంజూరు చేసినట్టు చెప్పారు. ఇప్పటికే సుమారు 60 శాతం వరకు పెన్షన్ పంపిణీ కార్యక్రమం పూర్తయిందన్నారు. కార్యక్రమంలో స్థానిక వలంటీర్‌లు జి.అంజలి, బీసీ నాయకుడు వీరంకి ప్రసాద్ పాల్గొన్నారు.

11 నుంచి ఆటల పోటీలు


కైకలూరు(కలిదిండి): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి కలిదిండి మండల స్థాయి ఆటల పోటీలు, 14వ తేదీ నుంచి నియోజకవర్గ ఆటల పోటీలు కలిదిండి మండలం ఆరుతెగలపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఆటల కార్యనిర్వహణాధికారి పి.లూయిస్ బుధవారం తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కబడ్డీ, బాల్ బాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, ఖోఖో, యోగా, అథ్లెటిక్స్ అంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. కలిదిండి మండలానికి సంబంధించి ఈ నెల 11న బాలురు, 12న బాలికలు, 13న స్పోర్ట్స్ నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు బాలబాలికలకు ఎంపికలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 97018 34513 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కలిదిండి పీడీలు మావుళ్లేశ్వరరావు, బి.కృష్ణకుమారి, కె.రత్నదాసు, ఎం.వెంకటేశ్వరరావు, టి.కీర్తికాంత్ పాల్గొన్నారు.

వినూత్న రీతిలో ప్రకృతి వ్యవసాయం



వేములమడ(మొవ్వ): ఏటీఎం విధానం ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబిస్తూ నాణ్యమైన మంచి పోషకాలు కలిగిన కాయగూరలు, ఆకు కూరలు సాగు చేసే ఏటీఎం విధానానికి మొవ్వ మండలం వేములమడలో రైతులు శ్రీకారం చుట్టారు. ప్రకృతి వ్యవసాయం మెంటర్ గొంగి పోతలయ్య పర్యవేక్షణలో బుధవారం 20 సెంట్ల భూమిలో ఏటీఎం పద్ధతి ద్వారా ఆకుకూర, కూరగాయలు, తీగ జాతి, దుంప జాతి నిరంతరం ఆదాయం వచ్చే విత్తనాలను రైతులు నాటారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు, ఫార్మర్ సైంటిస్టులు, రైతులు పాల్గొన్నారు.

సాయినాథునికి వెండిపళ్లెం బహూకరణ



గుడివాడటౌన్: స్థానిక గౌరీశంకరపురంలో ఉన్న శ్రీ గౌరీశంకరస్వామి వారి దేవస్థానం ఉప ఆలయమైన శ్రీ షిర్డి సాయిబాబా దేవస్థానంకు భక్తులు వెండిపళ్లెం బహూకరించినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం బుధవారం తెలిపారు. పట్టణానికి చెందిన గంటా బాలవెంకట నాగేశ్వరరావు దంపతులు 400.5 గ్రాముల వెండి పళ్లెం స్వామి వారి అర్చన కార్యక్రమాల వినియోగం నిమిత్తం అందజేశారన్నారు.

కనులపండువగా కృష్ణాష్టమి వేడుకలు



మండవల్లి శ్రీ కృష్ణాలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గుడివాడలో చిన్నారులతో వాకర్స్ క్లబ్ సభ్యులు

మండవల్లి: మండలంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు బుధవారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణుని మందిరాల వద్ద విశేష పూజలు చేశారు. స్థానిక శ్రీ కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురవీధుల్లో కృష్ణుని విగ్రహం ట్రాక్టర్‌పై ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో యువకులు నాట్యం చేస్తూ, భక్తిగీతాలు ఆలపించారు. చేబోయిన వీర్రాజు, ఆగొల్లు గంగారావు, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, చెన్ను మహాలక్ష్ముడు, చేబోయిన శ్రీను, చేబోయిన రామకృష్ణ, ఆగొల్లు వెంకన్న, చెన్ను పండు, జాజుల రాము పాల్గొన్నారు.

ఉత్సాహంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కైకలూరు: శ్రీకృష్ణాష్టమి వేడుకలను కైకలూరు నియోజకవర్గంలో ఉత్సాహంగా భక్తులు బుధవారం జరిపారు. కైకలూరు శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం కార్యాలయంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు చేబోయిన వీర్రాజు, భట్రాజు శివాజీ, బూరుబోయిన మోహనరావు, గంగుల అశోక్, గురజాల రవి, బోయిన చంద్రశేఖర్, పటాకుల వెంకటేశ్వరరావు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

నిమ్మకూరు గురుకుల జూనియర్ కళాశాలలో...

నిమ్మకూరు(పామర్రు): మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామంలో ఏపీ వృత్తి విద్యా గురుకుల జూనియర్ కళాశాలలో కృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వేడుకలను జరిపారు. కృష్ణుని చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు అందరూ ఉట్టి కొట్టే పండుగ జరిపారు. కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



వరహాపట్నంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల దృశ్యం

నేడు అల్లినగరంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

మండవల్లి: మండలంలోని అల్లినగరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయం వద్ద గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకల కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం దేవదాయ ధర్మదాయశాఖ పర్యవేక్షణలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

గుడివాడటౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం నిర్వహించారు. స్థానిక శారదా వికాస్ స్కూల్‌లో చిన్నారులకు ఫ్యాన్సీడ్రెస్ పోటీలతో పాటు కృష్ణుని వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు, కోశాధికారి చింతా రామకృష్ణ, ప్రాజెక్ట్ చైర్మన్ బి.కుటుంబరావు, రూప్‌చంద్ జైన్, కె.రామారావు, చందన వేణునాయుడు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణ భగవానుని శోభాయాత్ర

గుడివాడటౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని గురువారం పట్టణంలో రథోత్సవం నిర్వహిస్తున్నట్లు గుడివాడ నియోజకవర్గ యాదవ సంఘం నాయకులు తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని కృష్ణమందిరంలో బుధవారం సంఘం అధ్యక్షుడు డొక్కు రాంబాబు మాట్లాడుతూ గురువారం ఉదయం 6 గంటలకు కృష్ణాష్టమి పూజా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 9 గంటలకు కృష్ణ మందిరం నుంచి గుర్రాల రథంపై శ్రీకృష్ణభగవానుని పట్టణ పురవీధులలో ఊరేగిస్తారన్నారు. శోభాయాత్రలో భాగంగా గంగిరెద్దుల విన్యాసాలు, కోలాటం, కర్రసాము తదితర కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. గుడివాడ పరిసర ప్రాంత భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దారం నరసింహరావు, మెరుగుమాల కాశీ, లోయ రాజేష్, గోపర్తి మురళి, సతీష్, దారం ఏడుకొండలు, ఆర్‌వీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కైకలూరు: నియోజకవర్గంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీఎస్సార్ ఆక్వా ట్రేడర్స్ అధినేత బూరుబోయిన శ్రీనివాసరావు బొమ్మినంపాడు, వెంకటాపురం, సానారుద్రవరం, వరహాపట్నం, పెనుమాకలంక, కైకలూరు నియోజకవర్గ యాదవ సంఘ కార్యాలయాల్లో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమాలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ కార్యాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుక



కైకలూరు: ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఆటపాక కార్యాలయం వద్ద శ్రీకృష్ణాష్టమి వేడుకను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

కైకలూరులో ఇస్కాన్ టెంపుల్ ప్రారంభం



కైకలూరు: కైకలూరు–ఏలూరు రహదారిలో వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్ వద్ద రాధాకృష్ణ మందిరం (ఇస్కాన్)ను ఎంపీపీ అడవి కృష్ణ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఇస్కాన్ టెంపుల్ కమిటీ సభ్యులు వల్లభదాస్, వరదా శ్రీనివాస్, గుడివాడ చిట్టిబాబు, పెనుమూడి నాగరాజు, బొర్రా శ్యాంసుందర్ భక్తులు పాల్గొన్నారు.

పనిచేసిన వారిని ఆదరిద్దాం

- అబద్ధాలు చెప్పే చంద్రబాబును నమ్మవద్దు
- లక్ష్మీపురం గడప గడపలో మంత్రి జోగి రమేష్



జోరు వర్షంలోనూ గడప గడపలో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: అన్నివర్గాల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మండల పరిధి లక్ష్మీపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మంత్రి ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇప్పటి వరకు అందించిన సంక్షేమాన్ని వివరించారు. భవిష్యత్‌లో జగనన్న ద్వారా జరగబోయే మేలులను తెలిపారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ కల్లబొల్లి మాటలను చెబుతూ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తలుపు తట్టే రాజకీయ నాయకుల మోసపూరిత మాటలను నమ్మవద్దన్నారు. 14 ఏళ్ల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు హయాంలో ఏనాడైనా పేదల సంక్షేమాన్ని పట్టించుకున్నాడా అని ప్రశ్నించారు. తీర ప్రాంతంలో ఇంతటి అభివృద్ధి మునుపెన్నడూ జరగలేదని, మరింత అభివృద్ధితో మన గ్రామాల్లో ప్రజల జీవన విధానం మెరుగుపడాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని చెప్పారు.

రైతు బాంధవుడు జగనన్న..

రైతుల పక్షపాతి, రైతు బాంధవుడు జగనన్న అని, రైతుల అభ్యున్నతికి ఆయన ఎన్నో పథకాలు అమలు చేశారని మంత్రి జోగి రమేష్ తెలిపారు. లక్ష్మీపురంలో రూ.21 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి జోగి రమేష్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లోని రైతులకు అన్ని వసతులు అందే విధంగా ఆర్‌బీకేల నిర్మాణంతో వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టిన గొప్ప వ్యక్తి జగనన్న అని అన్నారు.

వర్షం లోనూ అదే జోరు..

గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతున్న సమయంలో కుండపోతగా వర్షం కురిసింది. అయినప్పటికి మంత్రి జోగి రమేష్ వర్షంలోనూ ఇంటింటికి తిరుగుతూ కార్యక్రమాన్ని కొనసాగించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

చిన్నారి కృష్ణుడితో మంత్రి సందడి..

గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా లక్ష్మీపురంలో ఇంటింటికి తిరుగుతున్న మంత్రి జోగి రమేష్‌కు ఓ ఇంటి వద్ద చిన్ని కృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారి కనిపించాడు. వెంటనే మంత్రి ఆ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడి సందడి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, సూపరింటెండెంట్ మధుసూదనరావు, ఎస్‌ఐ గణేష్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేయర్‌గా వెంకటేశ్వరమ్మ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన అనంతరం కేక్ కట్ చేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర మేయర్‌గా చిటికిన వెంకటేశ్వరమ్మ బుధవారం కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ నెల 4న జరిగిన మేయర్ ఎన్నికల్లో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మేయర్‌గా నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)కి కృతజ్ఞతలు తెలిపారు. నగరాభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, డెప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లతో సమష్టిగా నగరాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్‌గా తనను గెలిపించిన 43వ డివిజన్ ప్రజలకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. నగర కమిషనర్ జి.చంద్రయ్య, అసిస్టెంట్ కమిషనర్ బి.జ్యోతిలక్ష్మి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత, లంకా సూరిబాబు, కార్పొరేటర్లు మేయర్ దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

14న వాహనాలకు బహిరంగ వేలం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 14వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ ఈ.స్వరాజ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ ఉదయం 9 గంటలకు సీతారామపురం సిగ్నల్ వద్ద ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్ నందు వేలం నిర్వహిస్తామన్నారు. మూడు టూ వీలర్ వాహనాలకు వేలం జరుగుతుందన్నారు. పాటలో పాల్గొనదలచిన ఔత్సాహికులు రూ.5 వేలు ధరవత్తు చెల్లించాలని చెప్పారు. వేలంలో వాహనాలు దక్కించుకున్న వారు 18 శాతం జీఎస్టీ చెల్లించి వాహనాలు స్వాధీనం చేసుకోవాలన్నారు.

నిబంధనల ప్రకారం డ్వాక్రా గ్రూపులు నిర్వహించాలి

గుడివాడటౌన్: డ్వాక్రా గ్రూపులనేవి మహిళల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వ ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న సంఘాలని ఐద్వా కార్యదర్శి పి.రజని అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం గుడివాడ రూరల్ మండలం రామనపూడి గ్రామానికి చెందిన శక్తి గ్రూప్ సభ్యులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. గ్రూపులలో వయస్సు మళ్లినవారిని, రుణం డబ్బు, పొదుపు డబ్బు సక్రమంగా చెల్లించని వారిని తొలగించకుండా వ్యక్తిగత స్వార్థంతో గ్రూపుల్లో కొనసాగిస్తున్నారని, అధికారులు వెంటనే స్పందించి నిబంధనల ప్రకారం గ్రూపులు నిర్వహించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు లిల్లీ పుష్పం, అనూరాధ పాల్గొన్నారు.

ఎస్టీల గుర్తింపునకు రేపు కమిటీ రాక

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజలో నివాసముంటున్న కొండదొరలను ఎస్టీలుగా గుర్తించే విషయమై శుక్రవారం ప్రత్యేక కమిటీ సభ్యులు గ్రామానికి రానున్నట్లు తహసీల్దార్ కె.శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో నివాసముంటున్న కొండదొరలు ఎస్టీలుగా ధ్రువపత్రాలు పొందడానికి పలురకాలు అవస్థలు పడుతున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)కు వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో మాట్లాడి వీరిని ఎస్టీలుగా గుర్తించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. సీఎం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులు గ్రామానికి ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు వస్తారని తహసీల్దార్ తెలిపారు. కొండదొరలు తమ వద్ద ఉన్న ఆధారాలతో కమిటీ ముందు హాజరు కావాలని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి ధ్రువపత్రాలు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటారని తహసీల్దార్ తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గుడివాడటౌన్: స్థానిక కాకర్లవీధిలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన కాలక్షేప మండపం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈ హోమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ వై.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ దుడ్డు చిన్నా, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

లక్ష వెండి పుష్పాలకు పూజ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సింగ్‌నగర్‌లోని బసవపున్నయ్య స్టేడియంలో 8వ తేదీ నుంచి నిర్వహించే నవకుండాత్మక శ్రీ వైభవ మహాలక్ష్మి యాగానికి వినియోగించే వెండి పుష్పాలకు బుధవారం దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి పుష్పాలతో ఇంద్రకీలాద్రికి విచ్చేసిన నిర్వాహకులు దుర్గమ్మను దర్శించుకున్నారు. కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి ప్రారంభమైన ఊరేగింపులో శివజ్ఞానపీఠం పీఠాధిపతి శివాచార్య స్వామి పాల్గొన్నారు. అనంతరం దేవస్థానానికి చేరుకున్న నిర్వాహకులు అమ్మవారి పాదాల చెంత వెండి పుష్పాలను ఉంచి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొనకళ్ల విద్యాధరరావు, పల్లపోతు మురళీకృష్ణ, కొనకళ్ల సత్య కృష్ణప్రసాద్, శనగపల్లి అంబిక ప్రసాద్, కొల్లిపర రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ జాతర ప్రారంభం



కైకలూరు గంగానమ్మ జాతరను ప్రారంభించిన ఎమ్మెల్యే డీఎన్నార్ దంపతులు



గంగానమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

కైకలూరు: స్థానిక బైపాస్ రోడ్ ప్రారంభంలో గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) దంపతులు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ క్రమం తప్పకుండా జాతరను ప్రతి ఏటా జరిపిస్తున్న నిర్వాహకులను అభినందించారు. జాతర నిర్వాహకుడు తులసిపూర్ణ మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 10 వరకు గంగానమ్మ జాతర జరుగుతుందన్నారు. మొదటి రోజు అమ్మవారికి అభిషేకాలు, నైవేద్యాలు అందించామన్నారు. 7వ తేదీన నైవేద్యాల సమర్పణ, 8న అమ్మవారికి శ్రావణ కుంకుమ పూజలు, 9న చలివిడి, వడపప్పు, పానకం, నైవేద్యాల సమర్పణ, 10న అమ్మవారి జాతర, వేడి నైవేద్యాలు, గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్మించిన షెడ్డును ఎమ్మెల్యే దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఏఎంసీ ఉపాధ్యక్షుడు జంపన కొండరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బట్రాజు శివాజీ, నాయకులు చేయబోయిన వీర్రాజు, గంగుల అశోక్, నిమ్మల సాయి, తోట మహేష్, బుసనబోయిన శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు మార్కెట్‌యార్డు నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం



మట్టా నాగమణి, యార్డు చైర్‌పర్సన్

గుడివాడరూరల్: గుడివాడ మార్కెట్ యార్డు నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం ఈనెల 8వ తేదీ శుక్రవారం సాయంత్రం జరుగుతుందని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ తెలిపారు. లింగవరం గ్రామంలోని తన స్వగృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా మట్టా నాగమణి, వైస్ చైర్మన్‌గా చింతల భాస్కరరావు, సభ్యులుగా ఆకునూరి మేరీగ్రేస్, మసిముక్కు శివనాగరాజు, బండి రాంబాబు, షేక్ ఉస్మాన్, చేవూరి కమలకుమారి, చుక్కా నాగలక్ష్మి, అవుటపల్లి నాగలక్ష్మి, ఈడే శివనాగలక్ష్మి, మేరువ గోపి, అడపా జగదీష్, జిల్లా సుధారాణి, కఠారి శేషుబాబు, చందనపల్లి సుందరరావు, చినలింగాల పీఏసీఎస్ అధ్యక్షుడు, జిల్లా వాణిజ్య మార్కెటింగ్ అధికారి, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, బొమ్ములూరు స్పెషలాఫీసర్ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథులుగా మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎంపీలు నందిగం సురేష్, వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), పేర్ని వెంకట్రామయ్య(నాని), కైలే అనిల్‌కుమార్, వల్లభనేని వంశీమోహన్, కొక్కిలిగడ్డ రక్షణనిధి, ఎస్సీ సెల్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా శాంతి కల్యాణం



సుబ్బారాయుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ దంపతులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిశాయి. సోమవారం ప్రారంభించిన ఈ ఉత్సవాలు బుధవారం జరిగిన మహాకుంభాభిషేకం, పవిత్రజల సంప్రోక్షణ కార్యక్రమాలతో ముగిశాయి. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), వీరకుమారి దంపతులు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల మాస కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వేదికపై ఉంచి ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో అందంగా అలంకరించి పూజలు చేశారు. ఎమ్మెల్యే దంపతులు, ఎమ్మెల్సీ ఈ కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేసి ఆశీర్వచనాలు పొందారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, బొర్రా శేషుబాబు, బేతపూడి వెంకటరమణ, ఆనందదాసు శివనాగేంద్ర పాల్గొనగా ఆలయ చైర్మన్ శౌంతి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షణ చేశారు.

దేశ మనుగడకు దిక్సూచి భగవద్గీత



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న గీతా ప్రవచన కర్త ఘంటసాల బసవయ్య

జుఝువరం(పామర్రు): భగవత్ గీత, మహాభారతాలు మన దేశ మనుగడకు దిక్సూచి వంటివని ప్రముఖ గీతా ప్రవచన కర్త ఘంటసాల బసవయ్య అన్నారు. మండలంలోని జుఝువరం గ్రామంలోని శ్రీయోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ యాదవ్ భక్త బృందం, పామర్రు కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శ్రీకృష్ణ వేదిక వద్ద కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ అంతరించిపోతున్న ఆధ్యాత్మికతకు జీవం పోసే విధంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించి ఆదరించాలని కోరారు. అనంతరం ప్రముఖ కూచిపూడి నాట్య గురువు కళారత్న వేదాంతం రాధేశ్యామ్ మహాభారతంలోని కృష్ణ యక్ష గానాన్ని ఆలపిస్తూ శ్రీకృష్ణ బోధనను నాట్య రూపకం ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాపరిషత్ అధ్యక్షుడు ఎస్.త్రివిక్రమరావు, గౌరవ అధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్, శ్రీకృష్ణ కమిటీ కన్వీనర్ జొన్నలగడ్డ నాగరాజు, కళా పరిషత్ డైరెక్టర్ పామర్తి వెంకట నారాయణ, కొల్లా శ్రీనివాసరావు, కట్టా శ్రీనివాసరావు, తుంగల వేణు, గోపాల ప్రసాద్, సోమవరపు రామారావు, పోతురాజు పాల్గొన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు వెంకటరత్నం మృతి



వెంకటరత్నం మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



గుగ్గిలపు వెంకటరత్నం (ఫైల్)

కైకలూరు: కైకలూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, నియోజకవర్గ కూరగాయలు, పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు గుగ్గిలపు వెంకటరత్నం (పెదకాపు) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన కొద్ది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన కైకలూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు పనిచేశారు. కూరగాయలు, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో కైకలూరులో జరిగే వినాయక ఉత్సవాల ప్రధాన నిర్వాహకుడిగా ఉన్నారు. ఆయన భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఆటపాక గ్రామస్తులు, వ్యాపారులు సందర్శించి నివాళి అర్పించారు.